

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ముదినేపల్లి



ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ఆదివారం ముదినేపల్లి పోలీసులు పలుచోట్ల కవాతు నిర్వహించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించినట్లు ఎస్ఐ డి.వెంకటకుమార్ తెలిపారు. మండలంలోని వడాలిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.

కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన రెండు జిల్లాల అధికారులు
- ఏలూరు, పశ్చిమలో వెయ్యి మంది చొప్పున కౌంటింగ్ సిబ్బంది
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 600 మంది వరకూ పోలీసులు
- అసెంబ్లీ, పార్లమెంట్‌కు 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు
- పోలైన ఓట్లను బట్టి 16 నుంచి 21 రౌండ్లలో పూర్తి ఫలితం
- తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు
- సమస్యాత్మక గ్రామాల్లో ముందుగానే పోలీసుల మొహరింపు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రెండు జిల్లాల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఈ నెల నాలుగో తేదీ మంగళవారం జరగనున్న కౌంటింగ్ ప్రక్రియపై ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు అవసరమైన ముందస్తు చర్యలన్నీ తీసుకున్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి సిబ్బంది కేటాయింపు, వారికి శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ఏవిధంగా లెక్కించాలి, ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేయాలి, ఎన్ని రౌండ్లలో ఫలితాలు వెల్లడించాలి, పోలీస్ బందోబస్తు ఏవిధంగా ఉండాలి వంటి అనేక అంశాలపై పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఏలూరులోని సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌కు అదేవిధంగా టేబుళ్ల ఏర్పాటు జరిగింది. కౌంటింగ్‌కు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు ఇతర సిబ్బందిని మొత్తం వెయ్యి మంది వరకూ నియమించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో 17,500 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిని ముందుగా లెక్కిస్తారు. అనంతరం ఇవిఎంల ఓట్ల లెక్కింపు సాగనుంది. ఉంగుటూరు, ఏలూరు నియోజకవర్గాల ఓట్లు 16 రౌండ్లలో, కైకలూరు 17, దెందులూరు 18, చింతలపూడి 20, నూజివీడు 21, పోలవరం నియోజకవర్గ ఓట్లు 21 రౌండ్లలో లెక్కించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో కౌంటింగ్ కేంద్రం వద్ద 600 మంది పోలీసులను మొహరించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాన్ని ఒక డిఎస్‌పి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా సమస్యాత్మక గ్రామాల్లో ముందుగానే 20 మంది చొప్పున పోలీసులను మొహరిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. ఈ జిల్లాకు సంబంధించి రెండు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్‌కెఆర్ కాలేజీలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్, విష్ణు కాలేజీలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సాగనుంది. ఈ జిల్లాలో నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు 1,045 మంది సిబ్బందిని నియమించారు. ఈ జిల్లాలో 13,345 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ముందుగా ఈ ఓట్లను లెక్కించనున్నారు. ఈ జిల్లాలో సైతం కౌంటింగ్ కేంద్రాల వద్ద 600 మందికిపైగా పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 137 గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. బాణసంచా కాల్చడం, మద్యం అమ్మకాలను నిషేధించారు. ఏజెంట్లు ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ ప్రక్రియను జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

నాయకుల్లో టెన్షన్.. టెన్షన్

కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడటంతో ఇరు పార్టీల నాయకుల్లో టెన్షన్ నెలకొంది. ఫలితం ఎలా ఉంటుందోననే ఆందోళన అందరిలోనూ కన్పిస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ వెలువడిన తర్వాత రెండు జిల్లాల్లోనూ భారీగా పందేలు సాగుతున్నాయి. మండలాలు, గ్రామాలవారీగా సైతం పందేలు నడుస్తున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ మెజార్టీ వస్తే ఒకవిధంగా, ఏయే మండలాల్లో మెజార్టీ వస్తుందంటూ మరోవిధంగా పందేలు సాగాయి. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న కొద్దీ పందేల జోరు మరింత పెరుగుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

6 గంటలకే కౌంటింగ్ సిబ్బంది హాజరవ్వాలి

మారుమూల గ్రామాల నుండి వచ్చేవారు ముందురోజే వచ్చేలా చర్యలు

ఆర్ఒలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది ఈ నెల 4వ తేదీ ఉదయం 6 గంటలకే కౌంటింగ్ సెంటర్‌కు రావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులతో ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది నాలుగో తేదీ ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఆర్ఒలదేనన్నారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం తదితర ప్రాంతాల నుండి కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది ఈ సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోడానికి వీలుకాదని, అటువంటి వారిని గుర్తించి, వారితో ఫోన్ ద్వారా సంప్రదించి, వారిని ముందురోజే ఏలూరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని ఆర్ఒలకు స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల విధులకు సంబంధించి ముఖ్యమైన అంశాలపై చెక్‌లిస్ట్‌లను రూపొందించి వారికి అందించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి టెన్షన్ వాతావరణమూ లేకుండా సజావుగా కౌంటింగ్ సాగేలా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరూ విజయోత్సవ యాత్రలు, ర్యాలీలు చేసేందుకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, కౌంటింగ్ కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చేందుకు అత్యవసర ద్వారం ఏర్పాటుపై పరిశీలించాలని జిల్లా ఫైర్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ, డిఆర్ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, కె.అద్దయ్య, ఎం.ముక్కంటి, భాస్కర్, వై.భవానిశంకరి, డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.విశేశ్వరరావు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై పరిశీలకులకు వివరించిన కలెక్టర్

జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్‌లకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. స్థానిక రెవెన్యూ అతిథిగృహంలో ఆదివారం వారిని జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను వివరించారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో 200 మీటర్ల వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ చెప్పారు.

కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తి

ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేటాయిస్తూ రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ నెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల నియోజకవర్గాలవారీ నియామకానికి సంబంధించి రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసిలో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్, డాక్టర్ వి.అలీన్ సునీజా సమక్షంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియకు 259 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 318 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 292 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 869 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్లో పూర్తి చేశామని తెలిపారు. వీరందరికీ తిరిగి ఓట్ల లెక్కింపు రోజైన ఈ నెల 4వ తేదీ ఉదయం మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఎవరు ఏ టేబుల్‌కు వెళ్లాలో కేటాయిస్తామన్నారు.

ఉండిలో భారీ మెజార్టీతో గెలుస్తా

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రఘు రామకృష్ణంరాజు



ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం టిడిపికి కంచుకోట కావడంతో టిడిపి కేడర్‌తో పాటు జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సహకరించారని తెలిపారు. జనసేన కేడర్ ఉత్సాహంతో పని చేయడంతో టిడిపికి ఓట్ల షేరింగ్ జరిగిందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి భారీగా పోలింగ్ శాతం పెరిగిందన్నారు. పెరిగిన ఓటింగ్ శాతంలో యువ ఓటర్లు, మహిళలే కీలకపాత్ర పోషించారని భావిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటింగ్ టిడిపికి అనుకూలంగా పడ్డాయన్నారు. 46 గ్రామాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ నమోదైందన్నారు. పెరిగిన ఓటర్లు టిడిపికి సానుకూలంగా వేయడం వంటి అంశాలు గెలుపునకు దోహద పడనున్నాయని తెలిపారు. ఉండిలో టిడిపి భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు.

నిత్యం ప్రజల్లో ఉంటా.. అందుకే గెలిపిస్తున్నారు

టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు



ప్రజాశక్తి - పాలకొల్లు

నియోజకవర్గంలో వరుసగా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనను ప్రజాశక్తి పలుకరించగా పలు విషయాలు వెల్లడించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే నేతలకు ఏ నియోజకవర్గంలోనైనా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ఐదేళ్లలో జగన్ అరాచక పాలనకు వ్యతిరేకంగా మంగళవారం ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తున్నారని చెప్పారు. తాను 20 సంవత్సరాల కిందట ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో తన తండ్రి పేరున ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చేశానని, ఎందరో వృద్ధులు, మహిళలు, వికలాంగులు, విద్యార్థులు ఇలా దాదాపు ప్రతి నెలా ఏదో కార్యక్రమం ద్వారా వారిని ఆదుకుంటున్నాని తెలిపారు. తనకు కోట్ల రూపాయల ఆస్తి లేదని, కేవలం 20 ఎకరాల పొలం ఉంటే దానిలో 10 ఎకరాలు ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. తనకు ఎంఎల్ఎ కంటే ఫౌండేషన్ ద్వారా సేవ చేయడం ఇష్టమన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 2014 - 19 మధ్య రూ.600 కోట్లకు పైగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. నిధులు తేవడమే కాకుండా నిధులు ఖర్చు చేసేచోట తాను పర్యవేక్షిస్తూ పని పూర్తయ్యేలా చేశానని చెప్పారు. టిడిపి అధికారంలో లేకపోయినా గత ఐదేళ్లుగా వైసిపి యేతర ఎంపీల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. పాలకొల్లు పట్టణం అమృత్ పథకంలో లేకపోయినా చంద్రబాబు సహకారంతో రూ.600 కోట్లతో టిడ్కో గృహాలు నిర్మించినట్లు చెప్పారు. పట్టణంలో రూ.15 కోట్లతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామని, రూ.10 కోట్లతో ఎన్‌టిఆర్ కళావేదిక, రూ.12 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, హిందూ శ్మశానవాటిక, 2 పార్కులు ఇలా ఎన్నో శాశ్వత పథకాలు నిర్మించినట్లు చెప్పారు. అందుకే ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తున్నారని, వారికి ఇంకా సేవలు చేస్తానని చెప్పారు.



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోండి

సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సి.పురుషోత్తమకుమార్ సూచించారు. ఆదివారం ఆయన చింతలపూడి సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యం, అనారోగ్యంగా ఉన్న వారి గురించి ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, సోషల్ వర్కర్ అక్బర్‌ఆలీ పాల్గొన్నారు.

16 రౌండ్లలో 'ఏలూరు' ఫలితం

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఒ ఎం.ముక్కంటి



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి తెలిపారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ప్రజాశక్తి నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు అంశాలపై సమాధానాలిచ్చారు.

చిట్‌చాట్

ప్రశ్న: ఏలూరు నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు? ఎన్ని ఓట్లు పోలయ్యాయి?

ఆర్ఒ: ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,35,345 మంది ఓటర్లు ఉండగా 1,65,132 ఓట్లు పోలయ్యాయి.

ప్రశ్న: ఓట్ల లెక్కింపునకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్ఒ: ఓట్ల లెక్కింపు వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుంది. ఏలూరు ఎంపీ ఓట్ల లెక్కింపు, ఏలూరు ఎంఎల్ఎ ఓట్ల లెక్కింపు ఒకే హాలులో జరగనుంది. దీనికోసం అసెంబ్లీకి 14, పార్లమెంటుకు మరో 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అది కాక పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం మరో నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశాం.

ప్రశ్న. మొత్తం ఎన్ని రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది?

ఆర్ఒ: మొత్తం 16 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. 15 రౌండ్లు పూర్తిగాను, 16వ రౌండ్‌లో మూడు టేబుళ్లలో లెక్కింపు జరగనుంది.

ప్రశ్న: లెక్కింపు కేంద్రంలో ఎలాంటి నిబంధనలు అమలు చేయనున్నారు?

ఆర్ఒ: కౌంటింగ్ సిబ్బంది ఎవరూ కూడా, ఏ స్థాయి అధికారి అయినా సరే మొబైల్ ఫోన్ అనుమతించరు. ఉదయం ఆరు గంటలకే సిబ్బంది లెక్కింపు కేంద్రం వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించాం. పూర్తిగా లెక్కింపు పూర్తయ్యే వరకు ఎవరినీ బయటికి వెళ్లడానికి అనుమతించడం జరగదు. మీడియా ప్రతినిధులు కూడా వారికి కేటాయించిన ప్రాంతంలో ఉండి కవరేజీ చేసుకోవచ్చు.

ప్రశ్న: లెక్కింపు కేంద్రంలో ఒక్కో అభ్యర్థి తరపున ఎంతమంది ఏజెంట్లకు అనుమతి ఇస్తారు?

ఆర్ఒ: పోటీ చేసిన అభ్యర్థితోపాటు 14 టేబుళ్లకు 14 మంది ఏజెంట్లను నియమించుకోవచ్చు.

ప్రశ్న: లెక్కింపు కేంద్రం బయట, నియోజకవర్గంలో ఎలాంటి నిబంధనలు అమలు చేయనున్నారు?

ఆర్ఒ: నియోజకవర్గ పరిధిలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉంటాయి. మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేస్తారు. ఊరేగింపులు వంటివి నిషిద్ధం. ఎవరు నిబంధనలు అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

పెనుమంట్రలో వర్షం



పెనుమంట్రలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి మండలంలోని గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో 12 సెంటీమీటర్ల మేరకు వర్షపాతం నమోదైందని సంబంధిత అధికారులు వెల్లడించారు. రోహిణీ కార్తె నేపథ్యంలో ఒక పక్క ఎండ, మరో పక్క ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

టిడిపి హ్యాట్రిక్ వైసిపి బోణీ కొట్టేనా..!

పాలకొల్లు ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో టిడిపి హ్యాట్రిక్ కొడుతుందా.. వైసిపి బోణీ కొడుతుందా..అనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మంగళవారం మధ్యాహ్నానికి దీనిపై సస్పెన్స్ వీడనుంది. పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య 22 రోజులు సమయం ఉండటంతో రెండు పార్టీల నేతలు ఎవరి లెక్కలు వారు వేసుకుని విజయంపై ధీమాతో ఉన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 1,95,057 మంది ఓటర్లు ఉండగా 1,60,821 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో 79,974 మంది పురుషులు ఉండగా 80,844 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో నిమ్మల రామానాయుడు (టిడిపి)కు 67,549 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి డాక్టర్ బాబ్జికి 49,740 ఓట్లు పోలయ్యాయి. 17,809 ఓట్ల మెజారిటీతో నిమ్మల గెలిచారు. నాడు జనసేన అభ్యర్థి గుణ్ణం నాగబాబుకు 32,984 వేల ఓట్లు పోలయ్యాయి. టిక్కెట్ దక్కకపోవడంతో నాగబాబు వైసిపిని వీడి జనసేన తరపున బరిలో నిలిచారు. అయితే ఈసారి జనసేన కూటమిగా ఉండటంతో టిడిపి అభ్యర్థికి భారీ మెజార్టీ లభిస్తుందని ఆ పార్టీ ధీమాలో ఉంది. అయితే గుణ్ణం నాగబాబు తమ పార్టీలో ఉండటం, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు వైసిపికి ఓట్లు తెస్తాయనిఆ పార్టీ అభ్యర్థి గుడాల గోపీ ధీమాతో ఉన్నారు. ఏదేమైనా పాలకొల్లులో టిడిపి గెలిచి, రాష్ట్రంలోనూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే నిమ్మలకు మంత్రి పదవి దక్కే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి.

పాఠశాలల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



ప్రజాశక్తి - ఏలూరుటౌన్

విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తున్నాయి. పాఠశాలల పున:ప్రారంభానికి మరో పది రోజుల సమయమే ఉంది. ఏటా పాఠశాలలు తెరిచే సమయానికి తగిన ఏర్పాట్లు పూర్తి కాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఈసారి ముందస్తు ఏర్పాట్లతో విద్యార్థులను సాదరంగా ఆహ్వానించనున్నట్లు ఏలూరు ఎంఇఒ-2 రంగయ్య తెలిపారు. ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలను ఎలా సిద్ధం చేస్తున్నారు.

ఎంఇఒ-2: జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, గ్రీన్‌బోర్డ్స్, టేబుల్స్ వంటి ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. పిల్లలు వచ్చాక ఎలాంటి ఇబ్బందీ రాకూడదని మరోసారి అన్ని పరిశీలించాం. ఇబ్బందులున్న చోట్ల గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. బడి బయట పిల్లలను చేర్చుకునే కార్యక్రమం కొనసాగుతోంది.

ప్రశ్న: మండలంలో నాడు-నేడు పనులు పూర్తయ్యాయా?

ఎంఇఒ-2: మండలంలో 64 పాఠశాలల్లో రూ.21.45 కోట్ల మేర నాడు-నేడు పనులకు ప్రతిపాదనలు పంపించాం. సుమారు రూ.7.81 కోట్ల మేర నిధులు విడుదలవ్వగా, రూ.6.88 కోట్ల విలువైన పనులకు బిల్లులు అందజేశాం. చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి.

ప్రశ్న: విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారా?

ఎంఇఒ-2: విద్యాకానుక కింద విద్యార్థులకు మొదటి దశలో ఇవ్వాల్సిన నోట్‌బుక్స్, టెక్స్‌బుక్స్ వచ్చాయి. వాటిని త్వరలోనే పంపిణీ కేంద్రాల నుంచి విద్యార్థులకు అందజేస్తాం.

ప్రశ్న:హాజరు శాతం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఇఒ-2: నా పరిధిలో పాఠశాలల హాజరు శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాల బయట ఉన్న విద్యార్థుల డేటాబేస్ సేకరణ, డ్రాపవుట్లను గుర్తించి ప్రత్యేక శిక్షణ కేంద్రాల్లో చేర్పించడం, కర్రికులం, నాన్ కర్రికులం యాక్టివిటీస్ అందించే చర్యలు తీసుకుంటున్నాం. అమ్మఒడికి విద్యార్థుల తల్లులకు ఖాతాలు ప్రారంభిస్తున్నాం. సోషల్ ఆడిట్, కెపాసిటీ బిల్డింగ్ వంటివి అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం నూరుశాతం ఉండేలా చర్యలు తీసుకుంటాం.

భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల నాలుగో తేదీ ఉదయం 8 గంటల నుంచి భీమవరంలోని విష్ణు కాలేజీ, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజిలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ సందర్భంగా భీమవరంలో ఈ కింద విధంగా ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నారు.

ట్రాఫిక్ డైవర్షన్ ఇలా..

1.విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలూ కాళ్ల మండలం పెదఅమిరం పుంతరోడ్డు మీదుగా, ఉండి రోడ్డుకు చేరుకుని భీమవరం పట్టణంలోకి ప్రవేశించాలి.

2.భీమవరం నుంచి వచ్చే కార్లు, బైక్‌లు తదితర చిన్న వాహనాలు సర్ ఆర్థర్ కాటన్ పార్క్ (జువ్వలపాలెం రోడ్డు) వద్ద డైవర్షన్ తీసుకుని చినఅమిరం మీదుగా కోపల్లె హై స్కూల్ వద్ద కాళ్ల రోడ్డు ఎక్కి గుడివాడ విజయవాడకు వెళ్లాలి.

3.పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు బొంబాయి స్వీట్స్ వద్ద ఉండి రోడ్డుకు వచ్చి మల్టీప్లెక్స్ మీదుగా ఉండి, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, గణపవరం, ఏలూరుకు, అలాగే పెదఅమిరం పుంతరోడ్డు నుంచి కాళ్ల గుడివాడ విజయవాడకు వెళ్లాలి.

4.తాడేపల్లిగూడెం నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలూ గొల్లలకోడేరు వంతెన వద్ద డైవర్షన్ తీసుకుని పాలకోడేరు, కుముదవల్లి, మార్కెట్ యార్డు మీదుగా పాలకొల్లు వైపు, భీమవరం పట్టణంలోకి, ఉండి వైపు వెళ్లాలి.

5.భీమవరం నుంచి తాడేపల్లిగూడెం, తణుకు వెళ్లే వాహనదారులు బివి రాజు విగ్రహం వద్ద నుంచి ఉండి బైపాస్ మీదుగా మార్కెట్ యార్డు, కుముదవల్లి, పాలకోడేరు మీదుగా వెళ్లాలి.

6.జువ్వలపాలెం రోడ్డులో సర్ ఆర్థర్ కాటన్ పార్క్ నుంచి కాళ్ల రోడ్డు పెదఅమిరం పుంత రోడ్డు వరకూ నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. అలాగే ఉండి బైపాస్ రోడ్డులోని బివి రాజు విగ్రహం నుంచి గొల్లలకోడేరు విగ్రహం వరకూ నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు.

పై ట్రాఫిక్ డైవెర్షన్స్‌ను భీమవరం పట్టణ, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు గమనించి, జిల్లా పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్‌పి తెలిపారు.

పార్కింగ్ ప్లేసెస్..

1.ఆచంట, తణుకు నియోజకవర్గం నుంచి వచ్చేవారు విష్ణు క్యాంపస్ దగ్గరలోని అంజన, సంజన అపార్ట్‌మెంట్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

2. నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గం నుంచి వచ్చే వారు కొవ్వాడ, అన్నవరం రోడ్డు మీదుగా విష్ణు ప్లే గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.

3.భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వచ్చేవారు నాగరాజు మాల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

4.ఉండి, తాడేపల్లిగూడెం నియోకవర్గం నుంచి వచ్చేవారు కాళ్ల రోడ్డులో ఉన్న శ్రీరామ కోల్డ్ స్టోరేజ్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.


కైకరం కాలవరేవును శుభ్రం చేస్తున్న పెద్దిరాజు

స్థానికుల శ్రమదానం

కైకరం కాలువ రేవులో చెత్త, మట్టి తొలగింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరంలో తూర్పు వీధి సుందర సీతారామస్వామి స్నానాల రేవులో పేరుకుపోయిన చెత్తను, మట్టిని స్థానికులే స్వచ్ఛందంగా శ్రమదానంతో ఆదివారం తొలగించారు. ఏలూరు కాలవలో అనేక రేవులు మట్టితో పూడుకుపోయాయి. ఏలూరు కాలువకు ఈ నెల ఒకటో తేదీన అధికారులు నీటిని వదిలారు. రేవుల శుభ్రంపై ఇరిగేషన్, పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు .దీంతో స్వచ్ఛందంగా మట్టిని తొలగించుకుంటున్నామని చింతాడ పెద్దిరాజు చెప్పారు.


ఆర్థిక సాయం అందిస్తున్న భవన నిర్మాణ సంఘం నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని గోపాలపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి ఆర్థిక సాయం అందించకపోవడం శోచనీయమన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంఘం అండగా ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షులు పోతురాజు బాలాజీ, ఉపాధ్యక్షులు పరసా రాజేష్, కార్యదర్శి బత్తిన సూరిబాబు, అబ్దుల్ అక్బర్ బాషా, నాగబోయిన సత్యనారాయణ, కటికల వెంకట శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్‌సిఎం చర్చి ఫాదర్‌గా మరియదాస్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఆర్‌సిఎం చర్చి విచారణ ఫాదర్‌గా కె.మరియదాసు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మరియదాసు ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ విచారణ నుంచి బదిలీపై ముదినేపల్లి విచారణకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఫాదర్‌గా విధులు నిర్వహించిన మరియా కుమార్ బదిలీపై విజయవాడ వెళ్లారు. నూతన ఫాదర్‌గా బాధ్యతలు స్వీకరించిన మరియదాసుకు ఉప దేశకులు, సంఘ పెద్దలు, విశ్వాసులు, యువతీ, యువకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

నేరాలు - ఘోరాలు

పొగాకు తోటల్లో పచ్చాకు మాయం

వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి గ్రామంలో స్థానిక రైతుల పొగాకు తోటల్లో పచ్చాకును అక్రమంగా కొనుగోలు చేస్తున్న ఘంటశాల గాంధీ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మార్కెట్‌లో క్వింటా పొగాకు రూ.34 వేల వరకు ధర పలుకుతుండటంతో గ్రామానికి చెందిన ఘంటశాల గాంధీ అమాయక మహిళల అవసరాలను ఆసరాగా చేసుకుని వారికి కొంత నగదును ఇస్తూ అర్ధరాత్రి సమయాల్లో స్థానిక రైతుల పొగాకు తోటల్లోని పచ్చాకును దొంగతనం చేయించేవాడు. అనంతరం రెల్లిన ఆకులను తన బ్యారన్‌లలో ఉడికించుకొని పొగాకు బోర్డుకు తరలిస్తూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదిస్తున్నాడని రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఘటనపై సిపిఎం ఆగ్రహం

అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి ఎంతో కష్టపడి పొగాకు తోటలను సాగు చేసుకుంటున్న రైతుల పొగాకును దొంగలించడం పనికిమాలిన చర్య అని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఘంటశాల గాంధీ గ్రామంలో సొసైటీ అధ్యక్షులుగా ఉంటూ రైతులకు వ్యవసాయంలో చేయందించేది పోయి అదే రైతుల తోటల్లో పొగాకు దొంగలించేలా చేయడం ఆ డబ్బుతో పెద్ద మనిషిగా చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన అతడిని చట్ట పరంగా కఠినంగా శిక్షించి బాధిత రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పాలచర్ల రాజవరం గ్రామ శివారులో కోడింపదేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాలచర్ల రాజవరం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,050 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


బోరయ్య మృతదేహం

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రంలోని బీమాజీ జిల్లా రంగాపురి గ్రామానికి చెందిన డి.బోరయ్య (29) కొంత కాలం క్రితం నుంచి ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న లంక గ్రామాల్లో అతని బంధువులతో కలిసి చేపల చెరువుల్లో మేత వేసే పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సొంత గ్రామానికి వెళ్లేందుకు వివేక్ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కాడు. ఈ క్రమంలో రైలు భీమడోలు రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకునేసరికి ప్రమాదవశాత్తు బోరయ్య రైలు నుంచి జారి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సరోజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల బంగారు భవితకు శ్రీవిద్యాలయ బాటలు

జూనియర్ కళాశాల డైరెక్టర్ నాగార్జున, కరస్పాండెంట్ అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


నాగార్జున


అశోక్‌గజపతిరాజు

విద్యార్థుల బంగారు భవితకు శ్రీవిద్యాలయ జూనియర్ కళాశాల బాటలు వేస్తుందని ఆ కాలేజీ డైరెక్టర్ మల్లా నాగార్జున, కరస్పాండెంట్ మన్నే అశోక్ గజపతిరాజు అన్నారు. అతి తక్కువ ఫీజులతో అత్యుత్తమ కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ విద్యాలయ జూనియర్ కళాశాల అని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో శ్రీవిద్యాలయ జూనియర్ కళాశాలను నరసింహరావు పేటలోని జాన్‌స్ట్రీట్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అన్ని సబ్జెక్టులకు ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నామన్నారు. వారాంతపు పరీక్షలు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధనతో పాటు సంబంధిత అధ్యాపకులతో స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణంలో తరగతుల నిర్వహణ, ఒత్తిడి లేని విద్యాబోధన మా ప్రత్యేకత అని తెలిపారు. ఐఐటి, జెఇఇ, నీట్, ఎపిఇఎపిసెట్ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంపిసి, బైసిపి, ఎంఇసి, సిఇసి, హెచ్ఇసి (తెలుగు, ఇంగ్లీష్ మీడియా) గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ విధానం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ విద్యార్థులకు ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. సమీప గ్రామాల నుంచి విద్యార్థులను కళాశాలకు చేర్చేందుకు బస్సు సౌకర్యం కలదని తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని చెప్పారు. క్రమశిక్షణ, నిజాయితీ, జ్ఞానం, ఆత్మస్థైర్యం పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. శ్రీ విద్యాలయ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్చి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలని డైరెక్టర్ మల్లా నాగర్జున, కరస్పాండెంట్ మన్నే అశోక్ గజపతిరాజు కోరారు.


శ్రీవిద్యాలయ జూనియర్ కాలేజీ

తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్య

ఏలూరు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సోము సుధాకర్



ఏలూరు పబ్లిక్ స్కూల్


సుధాకర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని ఏలూరు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సోము సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తూ బట్టీ చదువులకు స్వస్తి పలికే విధంగా పిల్లలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏలూరు పబ్లిక్ స్కూల్‌ను ఏలూరులోని ఆర్ఆర్.పేటలో శ్రీనివాస థియేటర్ రోడ్డులో ప్రారంభించామని చెప్పారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని చెప్పారు. కంప్యూటర్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి సైన్స్, కొన్ని ప్రాజెక్టు పనుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ విధానం కోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్యాన్స్, పాటలతో కూడిన విద్యాబోధన చేస్తున్నామన్నారు. బాలికలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా తమను తాము రక్షించుకునే విధంగా కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. తమ వద్ద ఎల్‌కెజీ నుంచి ఏడో తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి యుకేజి వరకు ఎసి తరగతి గదులు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని చెప్పారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధనలు జరుగుతాయన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం, ఆత్మస్థైర్యం, జ్ఞానం పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఏలూరు పబ్లిక్ స్కూల్లో విద్యార్థులను చేర్చి వారి బంగారు భవితకు బాటలు వేయాలని డైరెక్టర్ సోము సుధాకర్ కోరారు.

కౌంటింగ్ నియమ నిబంధనలు పాటించాలి

జాయింట్ కలెక్టర్, దెందులూరు ఆర్ఓ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థులకు, వారి చీఫ్ ఏజెంట్లకు జాయింట్ కలెక్టర్, ఆర్ఓ బి.లావణ్యవేణి శనివారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ ప్రక్రియ నియమ నిబంధనలు, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియామల గురించి తెలిపారు. వట్లూరులోని సర్ సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దెందులూరు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ రోజైన ఈ నెల నాలుగో తేదీ ఉయదం ఏడు గంటల లోపు గుర్తింపు కార్డులతో హాజరు కావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి తీసుకురావటానికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఏ విధమైన ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడం కూడా నిషేధమన్నారు. కౌంటింగ్ రోజున మద్యం విక్రయం నిషేధమని తెలిపారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రం వద్ద కౌంటింగ్ రోజు డ్యూటీ వేసిన సిబ్బందికి సమావేశం నిర్వహించి సిబ్బంది చేయాల్సిన విధుల గురించి వివరించి పలు సూచనలు చేశారు. సిబ్బంది అందరూ కౌంటింగ్ రోజు నాలుగో తేదీ ఉదయం గంటలకు గుర్తింపు కార్డులతో హాజరు కావాలన్నారు. సిబ్బంది కూడా సెల్‌ఫోన్లను కౌంటింగ్ కేంద్రానికి తీసుకు రావొద్దని తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్‌లు సీలు చేసి జిల్లా ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

డ్రైయినేజీల పూడిక తీయరూ..!

రోడ్డుపై నిలిచిపోతున్న మురుగునీరు
విజృంభిస్తున్న దోమలు
రోగాలబారిన పడతామని ప్రజల భయాందోళన


డ్రయినేజీ పూడిక తీయకపోవడంతో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

ప్రజాశక్తి - చింతలపూడి

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ రోడ్డు నిండా మురుగు నీరు చేరుతుంది. డ్రెయినేజీలు పూడికలు తీయకపోవడం, ఆక్రమణకు గురవ్వడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చింతలపూడి నగర పంచాయతీ ఆర్‌కె.నగర్‌కి వెళ్లే రోడ్డుపైకి మురుగు నీరు చేరుకుంది. డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు రోడ్డు మధ్యలో నిలిచిపోతుంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా దోమలు విజృంభిస్తున్నాయని, తాము అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా డ్రెయినేజీల పూడిక తీయంకపోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపో తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు పూడిక తీయించాలని, రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వైవాకలో జోరుగా కోడిపందేలు

పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వైవాక గ్రామంలో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పెదగరువు క్రైస్తవ శ్మశానవాటికలో ఈ కోడిపందేలు జరుగుతున్నాయి. గత ఐదు రోజులుగా కోడిపందెం రాయుళ్లు పెద్ద సంఖ్యలో క్రైస్తవ శ్మశానవాటికకు చేరుకుని కోడిపందేలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ కోడిపందేలు జరుగుతున్నాయి. ఈ పందేలకు వైవాక, తుమ్మిడి, చైతన్యపురం, సింగరాయపాలెం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పందెం రాయుళ్లు వచ్చి పందేల్లో పాల్గొంటున్నారు. వైవాక గ్రామం మండలానికి చివర గ్రామం కావడంతో పందెం రాయుళ్లు ఈ గ్రామాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రం ముదినేపల్లికి వైవాక 20 కిలోమీటర్లు పైబడి దూరం ఉండడంతో పాటు పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో క్రైస్తవ శ్మశానవాటికలో కోడి పందేలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు గ్రామస్తులు కోంద్రు జోషి, దారం వినీతరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి క్రైస్తవ శ్మశానవాటికలో జరుగుతున్న కోడిపందేలను నిలుపుదల చేయడంతో పాటు పందేల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వారంలో కనీసం రెండు రోజులైన గ్రామంలో పోలీసులు పర్యటించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలు

కాసులు పుచ్చుకున్నారని అధికారులపై స్థానికుల విమర్శ
ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

అవినీతి అక్రమాలకు మండవల్లి రెవెన్యూ అడ్డాగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. పైసలిస్తే రెవెన్యూలో ఏ పనికైనా అధికారులు ఓకే చెప్పేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పైసలకు కక్కుర్తి పడి మరీ గుట్టు చప్పుడు కాకుండా రొయ్యల చెరువులు తవ్వుకునేందుకు అనుమతులు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తుంది. రొయ్యల చెరువుల తవ్వకాలకు అనుమతులు లేనప్పటికీ రొయ్యల చెరువు తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డకోలేదంటే ముడుపుల మత్తు ఏ స్థాయిలో ఉందనేది తేటతెల్లమవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి నిదర్శనమే కానుకోల్లులో అనుమతులు లేకుండా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలు అని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం... రొయ్యల చెరువులు తవ్వేందుకు ప్రభుత్వం అనుమతులను నిలుపుదల చేసింది. ఓ బడా బాబు కానుకొల్లులో గుట్టుచప్పుడు కాకుండా రొయ్యల చెరువులు తవ్వేందుకు రంగం సిద్ధం చేసుకుని రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. సుమారు రూ.రెండు లక్షలకు అధికారులు బడాబాబుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా జిల్లా అధికారులంతా ఎన్నికల పనిలో తలమునకలవుతున్నారని, గుట్టుచప్పుడు కాకుండా పని ప్రారంభించి రొయ్యల చెరువు పూర్తి చేసేసుకోవాలని రెవెన్యూ అధికారులు బడాబాబుకు ఉచిత సలహాను కూడా ఇచ్చినట్లు సమాచారం. రెవెన్యూ అధికారుల సహకారం మెండుగా ఉండడంతో బడా బాబు రెచ్చిపోయి 24 గంటల్లో సుమారు మూడు ఎకరాల చెరువును పూర్తి చేసేశాడు. అంతటితో ఆగకుండా ఎన్నికల పని పూర్తి చేసుకుని జిల్లా అధికారులు విధుల్లోకి వచ్చేలోపే మరో 20 ఎకరాలను గుట్టు చప్పుడు కాకుండా తవ్వేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూ అధికారుల వైఫల్యం వల్ల వేలాది ఎకరాల పంట భూమి అనుమతులు లేకుండా రొయ్యల చెరువుల పాలైపోయిందని ప్రజలు వివరిస్తున్నారు. దీంతో కాలుష్యం పెరిగిపోవడంతో పాటు స్వచ్ఛమైన తాగునీరందని పరిస్థితి నెలకొంది. రొయ్యల చెరువులపై విద్యుత్ వాడకం మితిమీరిపోయి విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ప్రభావంతో వీస్తున్న వడగాల్పులు, ఉక్కపోతతో ఉపశమనం పొందేందుకు విద్యుత్ కూడా లేకపోవడంతో రాత్రి పగలని తేడా లేకుండా పిల్లాపాపలతో అల్లాడిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అనుమతులు లేకుండా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలపై ఉక్కు పాదం మోపి తవ్వకాలను నిలుపుదల చేయాలని, అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూ శాఖలోని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండవల్లి తహశీల్దార్ ఎఎస్.సుభానిని వివరణ కోరగా చెరువు తవ్వకాలు చేసినట్లు తనకు తెలియదని, పరిశీలిస్తానని చెప్పారు.


రొయ్యల చెరువు అక్రమ తవ్వకం


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

కౌంటింగ్ రోజున ముందస్తు చర్యలు తప్పనిసరి

మండవల్లిలో ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి డి.మేరీప్రశాంతి జిల్లావ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తూ కైకలూరు సర్కిల్ మండవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన నిర్వహించే కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పికెట్లను సందర్శించి అక్కడ ఉద్యోగ నిర్వహణ చేస్తున్న సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఆదేశాలు ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా ఈ నెల నాలుగో తేదీన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన అవగాహనను ప్రజలకు కల్పించాలన్నారు. ఎన్నికల కేసుల్లో ఎవరైనా ఉంటే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, కౌంటింగ్ అనంతరం ఎటువంటి అల్లర్లు జరగకుండా తగిన చర్యలు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఎస్‌పితో పాటు ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

పాదముద్రలు పులివి కావు

ఆ ప్రాంతాన్ని పరిశీలించిన బీట్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - చింతలపూడి

పులి జాడ వార్తపై ఫారెస్ట్ అధికారులు స్పందించారు. రేచర్ల వాటర్ ట్యాంక్ సమీపంలో పులి జాడలు అనే అనుమానంపై వార్తకు ఫారెస్ట్ అధికారులు స్పందించారు. పాద ముద్రలు ఉన్న ప్రాంతాన్ని బీట్ ఆఫీసర్లు కోటేశ్వరరావు, వెంకటాచలం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంచరించింది అడవి జంతువే కాని ప్రమాదకరమైందని కాదని చెప్పారు. బర్రికొండ ఫారెస్ట్‌కు చెందిన బీట్ ఆఫీసర్ ఒకరు, ఎర్రగుంటపల్లి ఫారెస్ట్‌కు చెందిన బీట్ ఆఫీసర్ మరొకరు పాద ముద్రలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఒకటో పట్టణంలో ఉన్న వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి లైన్ పని నిమిత్తం ఈ నెల మూడో తేదీ సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సమయంలో వెంకన్నట్యాంక్ సబ్ స్టేషన్ చిరంజీవి బస్టాండ్, ఫీడర్ ప్రాంతాలు దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి ఆలయ ప్రాంతం, రాజా గారి మేడ, జెపి కాలనీ, చిరంజీవి బస్టాండ్ ప్రాంతం, పెద్ద దేవుడి ఆలయ ప్రాంతం, పొణంగి రోడ్డు, సెనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.